సాక్షి
ఒడిశా
గురువారం । 19 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,88,336లు, బంగారం 1 గ్రాము 690 మిల్లీగ్రాములు వెండి 5 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ముగిసిన ఉత్సవాలు

మాల్యవంత్ ఉత్సవాలు ముగిశాయి. కళాకారులు ప్రతిభ చూపారు.

- 8లో



ఉత్సవ జ్యోతి ఊరేగింపు

పర్లాకిమిడిలో గజపతి ఉత్సవ జ్యోతిని ఊరేగించారు. అధికారులు పాల్గొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

39 వేల గంజాయి మొక్కలు ధ్వంసం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి రంభీ అటవీ ప్రాంతంలో గంజాయి సాగుపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న 39 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వాటిని తగుల బెట్టారు. జిల్లా ఎస్పీ శ్వాతీ ఎస్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ఇటీవల కాలంలో గంజాయి సాగుపై విస్తృతంగా దాడులు చేస్తున్నారు.

గుప్తేశ్వర్ శివ పీఠం ఉన్నతికి సిద్ధం



గుప్తేశ్వర్‌లో పర్యటించిన రెవెన్యూ మంత్రి తదితరులు

జయపురం: కొరాపుట్ జిల్లాలోని ప్రసిద్ధ శివ క్షేత్రం గుప్తేశ్వర్‌ని సర్వాంగ సుందరంగా తయారు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒడిశా రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి తెలిపారు. రెవెన్యూ మంత్రి బుధవారం జయపురం సబ్‌డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా గుప్తేశ్వర పీఠాన్ని దర్శించుకున్నారు. ఆయన గుప్తేశ్వర్ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తులకు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమస్యలు గుర్తించి ఒక స్వతంత్ర్య మాస్టర్ ప్లాన్ సమర్పిస్తే అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ మంత్రి పూజారితో పాటు నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి, కొరాపుట్ ఎమ్మెల్యే బలభద్ర మఝి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భోత్ర, బొయిపరిగుడ బిడిఒ అభిమన్యు కవి శతపతి, తహసీల్దార్ స్నిగ్ధ చౌదురి నవరంగపూర్ ఎంపీ ప్రతినిధి నరేంద్ర కందాలియ, బీజేపీ మండల అధ్యక్షులు ఉమేష్ కుమార్ పట్నాయిక్, చంద్ర శేఖర రథ్, లలిత పూజారి, నటబర పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్, జయపురం జయకేతనం



నాల్గో రోజు విజేతలుగా నిలిచిన జయపురం విశ్వవిద్యాలయం, కొరాపుట్ టీమ్‌లు

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ ప్రథమ క్రికెట్ టోర్నమెంట్‌లో నాల్గో రోజు కొరాపుట్ కళాశాల, జయపురం విశ్వవిద్యాలయ టీమ్‌లు విజయం సాధించాయి. నాల్గో రోజున జరిగిన తొలి మ్యాచ్‌లో కొరాపుట్ ప్రభుత్వ కళాశాల టీమ్ గుణుపూర్ కళాశాల టీమ్‌తో తలపడింది. టాస్ గెలిచి కొరాపుట్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన గుణుపూర్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. ఆ జట్టులో బి.రంజిత్ 40 పరుగులు చేయగా దీపక్ 33 పరుగులు చేశారు. 153 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కొరాపుట్ కళాశాల టీమ్ అతి సునాయాసంగా గుణుపూర్ టీమ్ ను 9 వికెట్లతో ఓడించింది. ఒకే ఒక వికెట్ కోల్పోయి 12.3 ఓవర్లలో 156 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది. ఆ జట్టు ఆటగాడు నితీష్ కుమార్ 62 పరుగులు, భాస్కర్ 36 పరుగులు చేసి టీమ్ విజయానికి దోహద పడ్డాయి. రెండో మ్యాచ్‌లో సెమిలిగుడ ప్రభుత్వ కళాశాల టీమ్, జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీమ్‌లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెమిలిగుడ కళాశాల టీమ్ ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ ప్రారంభించిన విశ్వవిద్యాలయ టీమ్ 19.5 ఓవర్లలో 136 పరుగులు చేసి ఆలౌటైంది. 137 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన సెమిలిగుడ కళాశాల టీమ్ 16.2 ఓవర్లలో 122 పరుగులు చేసి ఆలౌటైంది.

గజపతి జిల్లా.. కళలకు ఖిల్లా



గజపతి ఉత్సవాలను స్టేడియంలో ప్రారంభిస్తున్న రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖ మంత్రి బిభూతి భూషన్ జెన్నా



గజపతి ఉత్సవాలు జరుగుతున్న స్టేడియంలో ప్రజావాహిని

పర్లాకిమిడి:

స్థానిక గజపతి స్టేడియంలో గజపతి ఉత్సవాలు, పల్లిశ్రీ మేళాను రాష్ట్ర ఖనిజ, వాణిజ్య, రవాణా మంత్రి బిభూతి భూషన్ జెన్నా మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఉత్సవాల పతాకాన్ని గజపతి స్టేడియంలో ఎగురవేశారు. రాష్ట్ర మంత్రి బిభూతి జెన్నాను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఘనంగా స్వాగతించారు. అనంతరం పల్లిశ్రీ మేళాను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గజపతి ఉత్సవాలలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన విభిన్న స్టాల్స్‌ను సందర్శించారు. గజపతి జిల్లా కళలకు పుట్టినిల్లు అని అన్నారు. ఉత్సవాలకు గౌరవ అతిథులుగా మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, సినీ నటి పింకి ప్రధాన్, డీఆర్‌డీఏ సీడీఎం గుణనిధి నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బిభూతి భూషణ్ జెన్నా మాట్లాడుతూ పర్లాకిమిడి మహారాజా శ్రీకృష్ణచంద్రగజపతి నారాయణ దేవ్ స్వతంత్ర ఒడిషాకు బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడారని అన్నారు. ఈ సందర్భంగా సినీ నటి పింకి ప్రధాన్ శ్రీరాం గీతాన్ని ఆలపించారు.



మంత్రి బిభూతి జెన్నాను ఆహ్వానిస్తున్న లంజియా సవర్ల నృత్యం



పల్లిశ్రీ మేళాను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి జెన్నా



గజపతి ఉత్సవ వేదికపై రాష్ట్రమంత్రి జెన్నా, ఇతర అతిథులు



గజపతి స్టేడియంలో రాష్ట్ర మంత్రి, రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు



మంత్రి బిభూతి జెన్నాకు వేదికపై సత్కారం

గూడ్సు రైలు ఢీకొని ఇద్దరు దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం

భువనేశ్వర్: రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు దాటుతుండగా సరుకు రవాణా రైలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా 2 వేర్వేరు బైక్‌ల మీద వెళ్తూ రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదానికి గురయ్యారు. రౌర్కెలా కళుంగా రైల్వే లెవెల్ క్రాసింగు గేటు దగ్గర మంగళవారం రాత్రి పూట ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బ్రాహ్మణి తరంగ్ ఠాణా పోలీసులు, ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) ఉమ్మడిగా కేసుపై విచారణ చేపట్టారు. గాయపడిన వారిని చేరువలో ఉన్న ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి ఉన్నత చికిత్స కోసం రౌర్కెలా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృత దేహాల్ని పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులంతా కళుంగ ప్రాంతంలో పని చేస్తున్నారు. మృతుల్లో ఒకరిని ఝార్ఖండు మరొకరిని అస్సాం ప్రాంతీయుడిగా గుర్తించారు. చికిత్స పొందుతున్న వారి పరిస్థితి విషమంగా కొనసాగుతుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్రంగా మండి పడ్డారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతంలో ఓవరు బ్రిడ్జి నిర్మాణం కోసం చేస్తున్న అభ్యర్థనల్ని పెడ చెవిన పెట్టి పలువురి ప్రాణాల్ని బలిగొంటున్నారని విరుచుకు పడ్డారు. దీంతో ఘటనా స్థలంలో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది.



ప్రమాద స్థలంలోని భీతావహ దృశ్యం

రెప్పపాటులో సర్వం దగ్ధం



ప్రమాద స్థలంలో దృశ్యం

భువనేశ్వర్:

పూరీ మంగళా ఘాట్ ప్రాంతం సబ్బుల కార్ఖానాలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కబురు అందడంతో అగ్ని మాపక దళం హుటాహుటిన ఘటనా స్థలం చేరే సరికి సర్వం కాలిపోయింది. ప్రాథమిక విచారణ ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్యతో ఈ ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నారు. మంటల తీవ్రతతో పైకప్పు, గోడలు కుప్ప కూలాయి. పలువురు కార్మికులు పనిలో మునిగి ఉండగా కార్ఖానాలో ఈ ప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు వీరంతా సమయస్ఫూర్తితో బయటకు తరలి రావడంతో ప్రాణాపాయం తప్పింది. కార్ఖానాలో అగ్ని మాపక వ్యవస్థ అందుబాటులో ఉండి ఉంటే ఇంతటి తీవ్ర ప్రమాదానికి అవకాశం లేకపోయేదని అగ్ని మాపక వర్గాల అభిప్రాయం. ఈ మేరకు విచారణ చేపట్టారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది



ఘటనా స్థలంలో ప్రమాదానికి ప్రేరేపించిన పరిస్థితులు సమీక్షిస్తున్న అగ్ని మాపక సిబ్బంది


బీజేపీలో చేరిన న్యాయవాదులు



బీజేపీలో చేరిన న్యాయవాదులకు కండువాలు కప్పుతున్న మంత్రి పూజారి తదితరులు

జయపురం: బీజేడీ పార్టీకి కంచుకోటగా ఉన్న కొరాపుట్ జిల్లాలో ఆ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు, మద్దతుదారులు అధికార బీజేపీలో చేరుతున్నారు. జయపురం న్యాయవాదులు 25 మంది మంగళవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీజేడీ సీనియర్ నేతలైన న్యాయవారులు గుప్తేశ్వర్ గంతాయిత్, సుధీర్ త్రిపాఠీలతో పాటు లాల్ మోహన మిశ్ర, రాజేంద్రకుమార్ శాంత్ర, నివేదిత రథ్, సస్మిత గంతాయిత్, హరిహర చౌదురి, ప్రమోద్ కుమార్ మహంతి, హరిహర చౌదురి, డి.శేషగిరి రావు, రవీంద్ర కుమార్ పాత్ర, ప్రియాస్ పట్నాయక్, పి.సన్యాసిరావు, బిభుతి రంజన్ మహాపాత్రో, బి.ఆర్.ప్రసాద్, జ్యోతిరంజన్ పూజారి తదితరులు ఉన్నారు. వారంతా కొరాపుట్ స్కూట్ హౌస్‌లో రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చ, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర, కొరాపుట్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుమంత ప్రధాన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతమ సామంతరాయ్, జయపురం బీజేపీ నేతలు లలిత అగర్వాల, బైద్యనాథ్ మిశ్ర ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి మోహణ మఝిల నీతివంతమైన పాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్టు న్యాయవాదులు చెప్పారు.

ధాన్యం మండీకి తాళం



ఆందోళన చేస్తున్న మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని గొడిగూడ పంచాయతీ ఎంవీ 11 గ్రామం వద్ద ధాన్యం మండీకి ఇంద్రావతి స్వయం సహాయక సంఘం మహిళలు తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా మండీ నిర్వహణ బాధ్యతలు ఇస్తామని చెప్పి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా జైమాకాళీ స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తున్నారని వాపోయారు. దీంతో విషయం తెలుసుకున్న జిల్లా ఆర్‌ఎంసీ అధికారులు, మల్కన్‌గిరి తహసీల్దార్ మండీ వద్దకు వెళ్లి మహిళలకు నచ్చజెప్పారు.

రైల్వే ఉద్యోగాల పేరిట అక్రమాలు

- తల్లీకొడుకులే పాత్రధారులు
- కొడుకు అరెస్టు
- పరారీలో తల్లి


భువనేశ్వర్: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తల్లీకొడుకుల ముఠా లక్షలాది రూపాయల మోసానికి పాల్పడింది. వీరిలో కొడుకు పోలీసులకు చిక్కాడు. బాధిత నిరుద్యోగ యువకుని ఫిర్యాదు ఆధారంగా చేపట్టిన విచారణలో నిందితుడు చిక్కాడు. ఈ మేరకు బలమైన సాక్ష్యాధారాలు చేతికి చిక్కాయని పోలీసు వర్గాలు తెలిపాయి. పరారీలో ఉన్న తల్లిని గాలించడంతో ఈ ముఠాలో ఇతర సభ్యుల వివరాల్ని ఆరా తీస్తున్నట్లు విచారణ వర్గం పేర్కొంది. మోసానికి గురై లక్షలాది రూపాయల్ని చేజార్చుకున్న బాధితుడు చిరంజీవి రౌత్ కటక్ బిడానాసి ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇతడు దాఖలు చేసిన వివరాలు ఆధారంగా పోలీసులు నిందిత మోసగాడు డేనియల్ రాజాని అరెస్టు చేశారు. విచారణ లోతుగా కొనసాగుతుందని తెలిపారు. ప్రధానంగా నిందితుని తల్లి సమర్పిత చౌదరి పరారీలో ఉంది.

ఆమె కోసం గాలిస్తున్నారు. బాలాసోర్ జిల్లాలో పలువురు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలాది రూపాయలు గుంజారు. 2022 సంవత్సరం నుంచి తల్లీకొడుకులు ఈ ఉద్యోగాల అమ్మకాల కార్యకలాపాల్లో తలమునకలై ఉన్నారు. అమాయక యువతిని నమ్మించేందుకు వీలుగా బూటకపు ఉద్యోగ నియామక పత్రాలు, అనుబంధ శిక్షణ వంటి చర్యలతో బురిడీ కొట్టించారు. కాలానుక్రమంగా ఇదంతా బూటకమని మోసపోయామని ఆలస్యంగా గుర్తించిన అమాయక నిరుద్యోగ యువత తమ సొమ్ము ఫిరాయించమని అభ్యర్థించగా ప్రాణాలు తీస్తామని తల్లీకొడుకులు బెదిరించడంతో పోలీసుల్ని ఆశ్రయించారు. ఉద్యోగ నియామకానికి సంబంధించిన బూటకపు వ్యవహారం సమగ్ర సాక్ష్యాధారాల్ని పోలీసులకు దాఖలు చేశారు. బాలాసోర్ జిల్లాతో పలు ఇతర జిల్లాల నుంచి నిరుద్యోగ యువతకు ఉద్యోగం పేరిట మోసం చేసి సుమారు రూ. 2 కోట్ల వరకు ఆర్జించినట్లు ఆరోపణ. ఈ వ్యవహారంలో డేనియల్ రాజాతో అతని తల్లి సమర్పిత చౌదరితో మరికొంత మంది తెర వెనక ఉన్నట్లు పోలీసు దర్యాప్తు బృందం సందేహిస్తుంది. ఈ కోణంలో ముఠా పూర్వాపరాల గుట్టు రట్టు చేసేందుకు నడుం బిగించింది.



మోసపోయిన బాధితుడు

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్



సెల్ టవర్ ఎక్కిన ఠాకూర్



ఠాకూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న దృశ్యం

రాయగడ: సెల్ టవర్‌పైకి ఎక్కి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. నాటకీయ పరిణామంగా రెండు గంటల పాటుగా కొనసాగిన ఈ ఘటనలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతనికి నచ్చజెప్పి కిందకి దించారు. జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనార జగన్నాథ మందిరం సమీపంలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలు తెలియజేశారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం చంపా ప్రాంతానికి చెందిన భీమసేన్ ఠాకూర్ అనే వ్యక్తి బుధవారం జగన్నాథ మందిరం సమీపంలోని సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. అక్కడి నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని అరవడం మొదలుపెట్టాడు. ఇది గమనించిన అక్కడ ఉన్న కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతనికి నచ్చజెప్పారు. దాదాపు రెండు గంటల సేపు అతడిని ఒప్పించి కిందికి దించారు. అనంతరం చందిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసలు ఎందుకు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడో పోలీసులు విచారిస్తున్నారు.

క్లుప్తంగా

కుసుమిలో మండీ ప్రారంభం



మండీ సభలో మాట్లాడుతున్న సివిల్ స అధికారి, వేదికపై ఎమ్మెల్యే తదితరులు

జయపురం: కొట్‌పాడ్ సమితి కుసిమి గ్రామంలో బుధవారం సాయంత్రం ధాన్యం మండీ ప్రారంభించారు. కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర మండీని ప్రారంభించారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారని హామీ ఇచ్చారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు ఉండకూడదని అధికారులకు, ప్రొక్యూర్ మెంట్ ఏజెంట్లకు స్పష్టం చేశారు. మండీ నియమ నిబంధనలను సివిల్ సప్‌లై అధికారి ఆశిష్ దాస్ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా లేంప్స్, ఆర్ఎంసీ అధికారులు ఎఫ్ఏక్యూ క్వాలిటీ ధాన్యం మాత్రమే కొంటామని స్పష్టం చేశారు. దీంతో రైతుల నుంచి ధాన్యం కొనలేదు. రైతులు విజ్ఞప్తి చేసినా వినలేదు. కార్యక్రమంలో కొట్‌పాడ్ సమితి అధ్యక్షులు కమళ భొత్ర, బీడీఓ బిక్రమ దొర, కొట్‌పాడ్ ఎన్ఏసీ మాజీ ఉపాధ్యక్షులు బాపూన్ త్రిపాఠీ, సివిల్ సప్‌లై అధికారి ఆశిష్ దాస్, లేంప్స్ ఎండీ, రాజి నాయిక్, కుసిమి సర్పంచ్ సనమతి గదబ, సమితి సభ్యులు జానకీ గదబ, సమితి ఉపాధ్యక్షులు బాబులి పాణిగ్రాహి, లేంప్స్ అధ్యక్షులు పద్మ భొత్ర, రాజేంద్ర రథ్, కేసీసీ బ్యాంక్ ఉపాధ్యక్షులు దురుపత భొత్ర, ఘనశ్యామ్ బిశాయి తదితరులు పాల్గొన్నారు.

20న ఎల్ఎల్‌బీ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో లాసెట్ – 2024 తుది విడత కౌన్సెలింగ్ తరువాత మిగులు సీట్లకు ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత బుధవారం తెలిపారు. డిగ్రీలో ఓసీ– 45 శాతం, బీసీ–42 శాతం, ఎస్టీ, ఎస్సీ– 40 శాతం మార్కులు కలిగి ఉండి లాసెట్ –2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. లాసెట్ ర్యాంకు కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, టీసీలతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఫీజు స్ట్రక్చర్ రూ.10345, పరీక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు ఎటువంటి ప్రభుత్వ రాయితీలు వర్తించబోవని స్పష్టం చేశారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 60 సీట్లకు గాను 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఇందులో రెండు ఈడబ్ల్యూఎస్ సీట్లు ఉన్నట్లు వివరించారు. విద్యార్థుల ఎక్కువగా హాజరైతే ర్యాంకు మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలో పెదపాడు పరిధి శాస్త్రులపేటలోని ఎంజేపీఏ ఏపీ బీసీ డబ్ల్యూ స్కూల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వాసుపల్లి నేతాజీ ఈనెల 17వ తేదీన ఉదయం అదృశ్యమైనట్లు విద్యార్థి తండ్రి వాసుపల్లి ధనరాజు బుధవారం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి సోంపేట మండలం ఇసుకలపాలేం గ్రామానికి చెందినవాడని తెలిపారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థి ఆచూకీ తెలిసినవారు 63099 90845 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పొలంలో గుర్తు తెలియని మృతదేహం

మెళియాపుట్టి : మండలంలోని గొప్పిలి గ్రామ శివారులో కొల్లాన సూర్యనారాయణ అనే రైతు పొలంలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. కొందరు రైతులు అటుగావె వెళ్లడంతో మృతదేహాన్ని గుర్తించి వీఆర్వో సింహాచలంకు సమాచారం అందించారు. ఆయన ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు. వృద్ధుడు రెండు వారాలుగా గొప్పిలి పరిసర ప్రాంతంలోనే తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఏపీఎస్ఆర్టీసీ 1వ, 2వ డిపోలలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డిపో మేనేజర్లు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీలోగా శ్రీకాకుళం 1వ, 2వ డిపోల కార్యాలయాలలో సంప్రదించాలని పేర్కొన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చి 18 నెలలు పూర్తయిన వారు అర్హులని తెలిపారు. పాస్ ఫోటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, జెన్యూన్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని, వివరాలకు 99592 25608, 9959225609 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సిలిండర్ల దొంగలు అరెస్టు

పొందూరు: మండలంలో గ్యాస్ సిలిండర్లు, సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల గ్యాస్ సిలిండర్లు మాయమవుతున్నాయని, సెల్‌ఫోన్లు చోరీ అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి టెక్కలి మండలం గోపీనాథపురం గ్రామానికి చెందిన కొమ్ము కార్తీక్, గాలి వెంకటేష్, నగిరి నాగరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 సెల్‌ఫోన్లు, 30 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొమ్ము కార్తీక్, గాలి వెంకటేష్ గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వారని ఎస్సై తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు.



కళాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న అతిథులు



శంబలపూరి నృత్యకారులకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ నుంచి బహుమతులు అందుకుంటున్న ఒడిస్సీ నృత్య కళాకారులు

ముగిసిన మాల్యవాంత్ ఉత్సవాలు



కళాకారిణి దేవీ నృత్య ప్రదర్శన

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలో కొద్ది రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి మాల్యవాంత్ ఉత్సవాలు మంగళవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. చివరిరోజు కళా ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో, బలిమెల ఎన్ఏసీ చైర్మన్ ప్రదీప్ నాయక్, మల్కన్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, డీపీఆర్వో ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు. కళాకారులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.



యాంకర్ల సందడి..

అందరి దృష్టి బీజేడీ వైఖరిపైనే

భువనేశ్వర్:

రాష్ట్రంలో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న బిజూ జనతా దళ్ ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషిస్తోంది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల పరిరక్షణతో రాష్ట్ర, దేశ సమగ్ర అభివృద్ధిలో భాగంగా ఇమిడి ఉంటాయనే దృక్పథంతో స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ విలువలకు భంగం కలగకుండా ఆది నుంచి ఆచి తూచి అడుగు వేయడంలో నవీన్ పట్నాయక్ హుందాతనం చాటుకున్న రాజకీయవేత్తగా పేరొందారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల దృష్ట్యా పార్టీ స్పర్ధల్ని పక్కన బెట్టి పలు సందర్భాల్లో కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు ప్రతిపాదనలకు అండగా నిలిచి విపత్తు నుంచి గట్టెక్కించిన దాఖలాలు కోకొల్లలు. ఇందుకు ప్రత్యక్ష తార్కాణం రైల్వే మంత్రిగా కొనసాగుతున్న అశ్విని వైష్ణవ్ సభ్యత్వం. నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు పార్టీ భేదాభిప్రాయాలకు అతీతంగా దేశ సమగ్ర అభివృద్ధి సత్సంకల్పంతో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అశ్విని వైష్ణవ్‌కు వరుసగా 2 సార్లు ఓటు వేసి గెలిపించి ఎగువ సభకు ప్రాతినిథ్యం కల్పించారు.

తాజాగా నరేంద్ర మోదీ సర్కారు ప్రవేశ పెట్టిన ఒక దేశం ఒక ఎన్నిక యోచన పట్ల బీజేడీ తన వైఖరిలో ఏమాత్రం తేడా లేకుండా లోతుగా సమీక్షిస్తోంది. ఒక దేశం ఒక ఎన్నిక బిల్లు పట్ల తమ పార్టీ ఆచి తూచి సకాలంలో సముచిత నిర్ణయంతో ముందుకు వస్తుందని బీజేడీ రాజ్యసభ సభ్యుడు సస్మిత్ పాత్రో ప్రకటించారు. మోదీ సర్కారు ప్రతిపాదించిన ఒక దేశం ఒక ఎన్నిక బిల్లు సమగ్ర సారాంశం లోతుగా పరిశీలించిన మేరకు దేశ హితవు సమీక్షించిన మేరకు తుది నిర్ణయం ఖరారవుతుందని, పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు పార్లమెంటులో తమ వైఖరి ఉంటుందని సస్మిత్ పాత్రో స్పష్టం చేశారు. బీజేడీ హుందాతనం ఏమాత్రం డీలాపడే ప్రసక్తే లేదన్నారు. దేశం, రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా పార్టీ రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ దిశలో అడుగు వేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఒక దేశం ఒక ఎన్నిక బిల్లు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పర్యవేక్షణలో ఉంది. ఈ కమిటీ నివేదికని బీజేడీ విశ్లేషించిన మేరకు నిర్మాణాత్మక శైలిలో తన నిర్ణయం నిర్ధారిస్తుంది.

మూడింట రెండు వంతుల బలం లేకుంటే పార్లమెంటులో ప్రతిపాదిత బిల్లు ఆమోదం పొంది చట్టంగా అమలు చేసే అవకాశం లేదనేది సుస్పష్టం. రాజ్య సభలో బిజూ జనతా దళ్ బలం 7 స్థానాలు. ఈ బలంతో నిర్ణయాత్మక శక్తిగా బీజేడీ తన ప్రాధాన్యతని మరోసారి తెరపైకి తెస్తుందని సమాచారం. ప్రతిపాదిత బిల్లు ఇంకా ప్రాథమిక దశలో కొనసాగుతోంది. భావి పరిణామాలపై అనుబంధ వర్గాల బహుముఖ అభిప్రాయాలతో బీజేడీ స్వీయ వైఖరిని సమన్వయపరచి సమయోచితంగా వ్యవహరిస్తుందని ప్రకటించింది. ఈ వైఖరితో పార్లమెంటులో అధికార, విపక్షాల దృష్టి బీజేడీపై కేంద్రీకృతమైంది.

శాసన సభలో పరోక్ష సంకేతం

రాష్ట్ర శాసన సభలో ప్రతిపాదిత ఒక దేశం ఒక ఎన్నిక యోచనను బిజూ జనతా దళ్ పరోక్షంగా వ్యతిరేకిస్తున్నట్లు అధికార పక్షం భావిస్తోంది. శాసన సభలో ఇటీవల ముగిసిన శీతా కాలం సమావేశాలను పురస్కరించుకుని ఈ ప్రతిపాదనపై బీజేడీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రణేంద్ర ప్రతాప్ స్వంయి ప్రసంగించారు. ప్రతిపాదిత బిల్లు ప్రజాస్వామ్య వ్యవస్థని బలహీనపరిచే లక్షణాలతో కూడి ఉందని, దీంతో జాతి సమైక్యత భావాలకు భంగం కలిగించే అవకాశం ఉంటుందని సూచనప్రాయంగా పేర్కొన్నారు. దీని ఆధారంగా బిజూ జనతా దళ్ ప్రతిపాదిత బిల్లుని వ్యతిరేకిస్తుందనే దుమారం రాజకీయ శిబిరాల్లో చర్చనీయాంశమైంది. అయితే బీజేడీ దేశ, రాష్ట్ర స్వార్థ ప్రయోజనాల కోసం చౌకబారు రాజకీయ ప్రయోజనాలకు తలొగ్గకుండా నిరంతరం ఆచి తూచి మెసలుకుని జాతీయ రాజకీయాల్లో పరపతిని పరిరక్షించుకుంటూనే ఉంది. ఇటీవల భారత ఉప రాష్ట్రపతి, రాజ్య సభ అధ్యక్షుడు జగదీప్ ధన్‌కర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం పట్ల బిజూ జనతా దళ్ మద్దతు నిరాకరించింది. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని ఆ పార్టీ రాజ్య సభ సభ్యుడు నిరంజన్ బిసి తెలిపారు.

ఆగి ఉన్న ట్రక్కును ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

జయపురం: జయపురం 26వ జాతీయ రహదారి డొంగాగుడ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం ఉదయం దట్టమైన పొగ మంచు కారణంగా ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు గమనించి క్షతగాత్రులను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సరుకు లోడుతో ఉన్న ట్రక్కు బ్రేక్ డౌన్ కారణంగా 26వ జాతీయ రహదారిలో పక్కన నిలిపి ఉంచారు. జగదల్‌పూర్ నుంచి దేవమాలి వెళ్తున్న కారు ట్రక్కును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న నిసిద్ధ వర్మ, ప్రశాంత కోర్మ, రబి నేతన్, మనోజ్ ధూబెలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా క్షతగాత్రులకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న క్షతగాత్రుల బంధువులు జయపురం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ సమక్షంలో బిడ్డ దత్తత



దంపతులకు బిడ్డను అప్పగిస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ చాంబర్‌లో బుధవారం సంతానం లేని కోరాపుట్‌కు చెందిన దంపతులకు ఆరు నెలల ఆడ శిశువును దత్తత నిమిత్తం అందజేశారు. కొద్ది నెలల క్రితం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వదిలేసిన ఈ శిశువును జిల్లా శిశు సురక్షా సమితి, నిస్సాన్ సలోం పిల్లల దత్తత కేంద్రం చేరదీసి సంరక్షించారు. మూడేళ్ల క్రితం కోరాపుట్‌కు చెందిన దంపతులు కేంద్ర పోష్యసంతాన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోగా నేటికి అధికారులు దరఖాస్తు పరీక్షించి ఆడశిశువును అధికార పూర్వకంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా శిశుసంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, నిస్సాన్ సలోం దత్తత కేంద్రం అధికారి స్వాలసింగి పాల్గొన్నారు. ఇప్పటివరకూ జిల్లా నుంచి 63 మంది పిల్లలను వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి దత్తతగా స్వీకరించారు.

గిరిజన మ్యూజియం అద్భుతం

- ఒకేలా గిరిజనుల ఆచార వ్యవహారాలు
- కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
- ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా
- గిరిగ్రామ దర్శినిలో గిరి మహిళల చీరకట్టుతో సందడి



గిరిమహిళ వస్త్రధారణలో ఒడిశా డిప్యూటీ సీఎం



సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ వద్ద గిరి మహిళలతో ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా

అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రతిమలతో ఏర్పాటుచేసిన గిరిజన మ్యూజియం అద్భుతమని ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరిడా పేర్కొన్నారు. ఒడిశాలో పర్యాటకరంగ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు బుధవారం ఆమె ప్రత్యేక హెలికాప్టర్‌లో అరకులోయ విచ్చేశారు. పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ఆమె ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అరకులోయ ప్రాంత గిరిజనుల సంప్రదాయం, ఆచార వ్యవహారాలు, ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని గిరిజనుల ఆచార వ్యవహారాలు ఒకేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడి మాదిరిగానే తమ రాష్ట్రంలోని కాఫీ రైతులకు సహాయ సహకారాలు అందించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్‌ను పరిశీలించారు.అక్కడ ఏర్పాటు చేసిన కెనాఫీ వాక్ బ్రిడ్జిను తిలకించిన ఆమె అటవీ సిబ్బందిని అభినందించారు. అరకులోయలోని కాఫీ మ్యూజియాన్ని సందర్శించారు. అరకు కాఫీ రుచి చూశారు. గిరిజన మ్యూజియాన్ని తిలకించారు. ఇక్కడి గిరిజనుల సంప్రదాయ ప్రతిమలతోపాటు గిరి మహిళలు థింసా నృత్యం చేస్తున్నట్టుగా ఉన్న ప్రతిమ వద్ద ఫొటో తీసుకున్నారు. అనంతరం పెదలబుడు పంచాయతీలోని గిరిగ్రామ దర్శినిని సందర్శించారు. ఆమెకు గిరి మహిళలు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. వారితో కలిసి నృత్యం చేశారు. అనంతరం గిరి మహిళల చీరకట్టుతో సందడి చేశారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా ఏర్పాటుచేసిన ఇళ్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి. కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ పాల్గొన్నారు. పాడేరు డీఎస్పీ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో అరకులోయ సీఐ ఎల్.హిమగిరి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



థింసా నృత్యం చేస్తున్న గిరి మహిళ ప్రతిమల వద్ద ప్రవతి పరిడా

ఉత్సాహంగా గజపతి ఉత్సవ జ్యోతి ఊరేగింపు




పర్లాకిమిడి మార్కెట్ జంక్షన్‌లోని శ్రీకృష్ణచంద్ర గజపతి మహారాజా విగ్రం వద్ద గజపతి ఉత్సవ జ్యోతి

పర్లాకిమిడి: స్థానిక శ్రీజగన్నాథ మందిరం నుంచి గజపతి ఉత్సవాల జ్యోతిని పట్టణంలోని పలు కూడళ్లలో బుధవారం సాయంత్రం ఉత్సాహంగా ఊరేగించారు. గజపతి ఉత్సవాలు ప్రారంభోత్సవాల సందర్భంగా మార్కెట్ కూడలి వద్ద మహారాజా శ్రీకృష్ణచంద్రగజపతి విగ్రహానికి పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి నివాళులర్పించారు. అనంతరం మేళతాళాలతో ఉత్సవ జ్యోతిని హైస్కూల్ జంక్షన్ మీదుగా గజపతి స్టేడియం వద్దకు చేరుకొని గజపతి ఉత్సవాల వేదిక వద్ద ఉంచారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, డిప్యూటీ కలెక్టర్ కమల కాంత పండా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ పాల్గొన్నారు.



ఉత్సవ జ్యోతితో ఊరేగింపులో పాల్గొన్న డీసీవో అర్చనా మంగరాజ్

రక్తమోడుతున్న రహదారులు



- డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్తున్న వాహనాలు
- ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం
- మూడు వారాల్లో 18 మంది మృత్యువాత

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో రహదారులు రక్తమోడుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, తొందరగా గమ్యం చేరాలనే ఆతృత, నిద్రమత్తు.. ఇలా కారణాలు ఏవైతేనే దాదాపు ప్రతిరోజూ నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. మూడు వారాల వ్యవధిలో 18 మంది మృత్యువాత పడ్డారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రహదారులపై రక్తపు మరకలు తడారకముందే మరో ప్రమాదం చోటుచేసుకుని తునాతునకలుగా రక్తపు ముద్దలు ఎగిరిపడుతున్నాయి. వాహనచోదకుల నిర్లక్ష్యంతో పాటు రహదారుల నాణ్యతా ప్రమాణాల్లో లోపం కూడా కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

ప్రాణాలు తీస్తున్న అతివేగం..


- నవంబరు 30న విజయనగరం జిల్లా భోగాపురం వద్ద హైవేపై మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కించి ఆవలి రోడ్డు వైపునకు వెళ్లి లారీని ఢీకొనడంతో నలుగురు జిల్లావాసులు దుర్మరణం చెందారు.
- కొద్దిరోజులు క్రితం పైడిభీమవరంలో రాత్రి సమయంలో హైవే ఫ్లై ఓవర్‌పై రక్షణగోడను మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనం ఢీకొనడంతో చోదకుడు పైనుంచి కింద సర్వీసు రోడ్డు ఫుట్‌పాత్‌పై పడి ప్రాణాలు వదిలాడు.
- ఈ నెల 9న రణస్థలం పాత పెట్రోల్ బంక్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న పాటయ్యను మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- ఈ నెల 8న తమిళనాడు నుంచి జార్ఖండ్‌కు వెళ్లేందుకు కొబ్బరికాయల లోడుతో వస్తున్న లారీ ఎచ్చెర్ల ఫరీదుపేట కొయ్యరాళ్ల కూడలి వద్ద విద్యుత్తుస్తంభాన్ని (టవర్‌ను) బలంగా ఢీకొట్టి ఆగి పోయింది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ మృతి చెందగా వెనుక నిద్రిస్తున్న క్లీనర్ ప్రాణాలతో బయటపడ్డా డు. ఏమాత్రం స్తంభాన్ని ఢీకొన్న లారీ ఆగకపోయివుంటే సమీపంలో ఉన్న ఇళ్లల్లో చొచ్చుకుపోయేది.
- ఈనెల 5న మెళియాపుట్టి మండలం చినహంస సమీపంలో ధాన్యపు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎడ్జ్‌లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ యువకుడు, బాలిక మృతిచెందారు. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై నలుగురు వెళ్లడం గమనార్హం..
- ఈ నెల 4న మెళియాపుట్టి మండలం కొసమాలకు చెందిన శామ్యూలు, మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- ఈ నెల 1న లావేరు మండలం బొంతపేట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఓ వ్యక్తి గాయాలపాలై మరుసటి రోజు మృతిచెందాడు.
- నవంబరు 30న జి.సిగడాం మండలం సంతపురిటి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాజాంకు చెందిన మహిళ మృతిచెందింది.
- నవంబరు 28న ఆమదాలవలస పార్వతీశ్వరునిపేట సమీపంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాలకొండ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. వీరఘట్టం మండలం జె.గోపాలపురం యువకుని తలపైనుంచి బస్సు టైర్ ఎక్కేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి.
- నవంబరు 27 అర్ధరాత్రి ఒంటిగంటకు కంచిలి సమీప జాడుపూడి కాలనీ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి డివెడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మరణించాడు.
- కంచిలి మండలంలోని కొన్నాయిపుట్టుగ పంచాయతీ సూదిపుట్టుగ గ్రామం వద్ద డిసెంబర్ 14న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన రమేష్ బెహరా(25) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు.
- రణస్థలం మండలంలోని వల్లభరావుపేటకు చెందిన దన్నాన సూర్యనారాయణ(58) డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. • నరసన్నపేట మండలం జోగిపేటకూడలికి చెందిన నారాయణశెట్టి భవాని (35) డిసెంబర్ 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. • ఆమదాలవలస మండలంలోని ముద్దాడపేటకు చెందిన లాస ఎర్రయ్య(40) డిసెంబర్ 14న ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- కోటబొమ్మాళి మండలం పాకివలస వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు సంపతిరావు త్రివేణి(30) మృతిచెందారు.



మెళియాపుట్టి మండలం చిన్నహంస వద్ద ప్రమాదంలో..(ఫైల్)

కొంపముంచుతున్న నిర్లక్ష్యం..

కాంక్రీట్ దిమ్మలు అడ్డంగా ఉంచేయడం, వర్షాలు పడితే నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించకపోవడం, జారిన ఇసుకను వారాల తరబడి తీయకపోవడం, గుంతలు పూడ్చకపోవడం, ఎడ్జుల్లో గ్రావెల్‌ను నింపకపోవడం, పొదలు తొలగించకపోవడం వంటి చిన్న చిన్న నిర్లక్ష్యాలూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. హెల్మెట్లు ధరించని ద్విచక్ర వాహనచోదకులను అంతగా పట్టించుకోకపోవడం, ట్రిపుల్ రైడింగ్‌కు మించి నడపడం, ఓవర్‌స్పీడ్ తెలిపే నియంత్రికలు లేకపోవడం.. ఒకవేళ ఉన్నా అవి వాహనదారునికి తెలియకుండా చలానాలు ఆన్‌లైన్‌లో వేసేయడం వంటివి చేస్తుండటంతో చాలామంది సీరియస్‌గా తీసుకోవడం లేదు. మరోవైపు కార్లలో సీట్‌బెల్టు ధరించకపోయినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇక ట్రాక్టర్లు, ఆటోలు, లారీలు, ఓవర్‌లోడింగ్ వాహనాల సంగతి సరేసరి.





ఎచ్చెర్ల కొయ్యిరాళ్ల కూడలి వద్ద టవర్‌ను ఢీకొన్న లారీ(ఫైల్)

క్లుప్తంగా

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన పైడిరాజు


పతకాలతో పైడిరాజు

సాలూరు రూరల్: ఈ నెల 14,15 తేదీలలో గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 44వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొన్న సాలూరు మండలంలోని మామిడిపల్లికి చెందిన పైడిరాజు 800 మీటర్లు, 400మీటర్లు, 400 రిలే పరుగుపందెంలో సత్తాచాటి బంగారు పతకాలు సాధించినట్లు పీఈటీ శ్రీరాములు తెలిపారు. ఆమె గతం యూనివర్సిటీ డెంటల్ కళాశాలలో ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. ఆమె విజయం పట్ల మామిడిపల్లి గ్రామపెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

బొండపల్లి: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి26పై బుధవారం ఉదయం ద్విచక్రవాహన చోదకుడిని కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం వైపు నుంచి విజయనగరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి తన వివరాలు చెప్పలేని పరిస్థితిలో ఉండటంతో గజపతినగరంలోని సీహెచ్‌సీకి ఎస్సై యు.మహేష్ తరలించి చికిత్స అందిస్తున్నారు.

వైభవంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా సూర్యోదయానికి ముందు ప్రాతఃకాలార్చన, బాల భోగం, శ్రీ గోదాదేవి పల్లకిసేవ, తదితర కార్యక్రమాలు జరిపించారు. అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం జరిపించి, రామాయణంలో పట్టాభిషేక సర్గ హవనం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బాలగుడబ గ్రామానికి చెందిన అవినీ సతీష్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సతీష్‌కు పెళ్లై 14సంవత్సరాలైంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి అలవాటు పడడంతో ఎప్పటికప్పుడు భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీంతో భార్య 5సంవత్సరాల నుంచి పిల్లలతో కన్నవారింట్లో ఉంటోంది. ఎన్నిసార్లు కబురు పంపినా, పెద్దలతో పిలిపించినా నోటీసులు ఇచ్చినా ఆమె రాలేదు. దీంతో మనస్థాపం చెంది మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటిమేడపైకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా డా. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పార్వతీపురం కోర్టు మేజిస్ట్రేట్ సమక్షంలో వాంగ్మూలం తీసుకుని వివరాలు నమోదు చేసినట్లు అవుట్‌పోస్టు ఏఎస్సై నిమ్మ కాయల భాస్కరరావు తెలిపారు.

బైక్ బోల్తా పడి మహిళ మృతి

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి బైక్ బోల్తా పడి ఓ మహిళ మృతిచెందింది. ఈ మేరకు ఎస్సై జి.భాస్కర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం కాశీపేటకు చెందిన దుప్పాడ ఉషారాణి(49)తన కుమారుడు అజయ్‌చందుతో కలిసి దత్తిరాజేరు మండలంలోని మరడాంలో బంధువుల ఇంటిలో జరిగిన శుభకార్యానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పాత బొబ్బిలి వద్ద ఉన్న రోడ్డుపై గుంతల వద్ద బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన ఉషారాణిని బొబ్బిలి సీహెచ్‌సీకి అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

భక్తి శ్రద్ధలతో కాకడ హారతి

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస సందర్భంగా మూడో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజారులు కాకడ హారతితో ఆలయ ప్రదక్షిణలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై కక్ష తగునా..!

- గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ భర్తీలో జాప్యం
- తీవ్రఆందోళనలో అభ్యర్థులు
- కాలయాపన చేస్తున్న అధికారులు


ప్రభుత్వ వైద్య కళాశాల

విజయనగరం ఫోర్ట్:

అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు ఇప్పిస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుడు చెప్పిన మాటలు ఊసే ఎత్తడం లేదు. కొత్త ఉద్యోగాలు మాట దేవుడు ఎరుగు. భర్తీ చేయాల్సిన పోస్టులకు కూడా దిక్కు లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో నోటిఫికేషన్ ఇచ్చారని అక్కసుతో కూటమి ప్రభుత్వం ఆ పోస్టులు భర్తీ చేయకుండా జాప్యం చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు దరఖాస్తు చేసినవారు ఏ పార్టీకి చెందినవారూ కాకపోయినప్పటికీ వారి పట్ల కూటమి ప్రభుత్వం నిర్దయతో వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడైనా నోటిఫికేషన్ ఇస్తే నెల, రెండు నెలల్లో భర్తీ చేస్తారు. ఏడాది అయినా నరేపోస్టులు భర్తీ చేయలేదు. తమ పోస్టులు భర్తీ చేయాలని అభ్యర్థులు కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినప్పటికీ వారి గోడు పట్టించుకునే వారే కరువయ్యారు.

2023 నవంబర్‌లో నోటిఫికేషన్

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. వైద్యరంగ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా జీరో వెకెన్సీ పాలసీని తీసుకొచ్చి ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసింది. దీంతో సిబ్బంది కొరత ఎక్కడా కనిపించేది కాదు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పడిన ఖాళీల భర్తీకి 2023 నవంబర్ 9 వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చారు. 20 కేటగిరీలకు సంబంధించి 63 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా 1000 మంది వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో కొన్ని పోస్టులకు ఫైనల్ మెరిట్ లిస్టు కూడా ప్రకటించారు. మరికొన్ని పోస్టులకు ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పోస్టుల భర్తీ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ అనంతరం భర్తీ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నా అధికారులు ఇప్పటివరకు చేపట్టకుండా తీవ్ర జాప్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టుల భర్తీని అడ్డుకున్న అధికారి

అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న ఓ అధికారి పోస్టుల భర్తీ చేయకుండా అడ్డుకున్నారనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం నవంబర్ 30 వతేదీలోగా పోస్టులను భర్తీ చేసుకోవాలని అనుమతి ఇచ్చినప్పటికీ సదరు అధికారి పోస్టుల భర్తీ చేయకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 30 వతేదీ లోగా పోస్టులు భర్తీ చేయడానికి వైద్య కళాశాల అధికారులు ప్రాసెస్ నిర్వహించినప్పటికీ సదరు అధికారి అడ్డుపుల్ల వేసినట్టు సమాచారం. నోటిఫికేషన్ కాలపరిమితి ముగిసిందని అధికారులు మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది. దీంతో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కొత్తగా నోటిఫికేషన్ వస్తే తమకు ఉద్యోగం వస్తుందో, రాదోనని ఆవేదన చెందుతున్నారు. నిరుద్యోగులకు మేలు చేస్తారని కూటమికి సర్కార్‌కు గద్దె నెక్కిస్తే తీవ్ర అన్యాయం చేస్తున్నారని అభ్యర్థులు వాపోతున్నారు.

ఆఫీస్ సబార్డినేట్ పోస్టులో ప్రథమస్థానం



ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు ఎంపిక చేసిన ఫైనల్ మెరిట్ జాబితాలో ప్రథమ స్థానంలో ఉన్నాను. ఆరు నెలలుగా వైద్య కళాశాల అధికారులను పోస్టులు భర్తీ ఎప్పుడు చేస్తారని అడుగుతున్నాం. నిన్నటి మొన్నటివరకు చేస్తామని చెప్పారు. దీంతో ఉద్యోగం వస్తుందని గంపెడాశలు పెట్టుకున్నాం. ఇప్పుడు కొత్తగా నోటిఫికేషన్ ఇస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

శంకరావు మజికంఠ, ఆఫీస్ సబార్డినేట్ అభ్యర్థి

కొత్తగా నోటిఫికేషన్ ఇస్తే మా పరిస్థితి ఏంటి ?



ఎలక్ట్రికల్ హెల్పర్ పోస్టులో ప్రథమ స్థానంలో ఉన్నాను. ఇప్పుడు ఆ నోటిఫికేషన్ ఇస్తే నా ఉషన్ కాదని మళ్లీ నోటిఫికేషన్ ఇస్తే నా పరిస్థితి ఏంటి. ఉద్యోగం వస్తుందని ఏడాది నుంచి ఆశగా ఎదురు చూస్తున్నాను. ఇది దారుణ అన్యాయం.

ఎస్.ధనుంజయనాయుడు, ఎలక్ట్రికల్ హెల్పర్ అభ్యర్థి

ల్యాబ్ అటెండెంట్ పోస్టుజాబితాలో ఫస్ట్ పేరు



ల్యాబ్ అటెండెంట్ జాబితాలో ఫస్ట్ పేరు నాదే. ఉద్యోగం వచ్చేసినట్టేనని సంబరపడ్డాను. నోటిఫికేషన్ ఇచ్చి ఏడాది అయినా అధికారులు భర్తీ చేయలేదు. నిన్న మొన్నటి వరకు వైద్య కళాశాల అధికారులు భర్తీ చేస్తామంటూ చెప్పుకొచ్చారు. ఇప్పుడు నోటిఫికేషన్ కాలపరిమితి అయిపోయిందని అంటున్నారు. ఉద్యోగానికి వయోపరిమితి కూడా అయిపోతోంది. ఇప్పుడు నా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

షేక్ రెహమాన్, ల్యాబ్ అటెండెంట్ అభ్యర్థి

నోటిఫికేషన్ కాలపరిమితి దాటింది



20 కేటగిరీలలో 63 పోస్టులకు సంబంధించి 2023 నవంబర్ నెలలో ఇచ్చిన నోటిఫికేషన్ కాలపరిమితి 2024 నవంబర్‌తో ముగిసింది. దీంతో మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని డీఎంఈకు ప్రతిపాదనలు పంపించాం.అనుమతి రాగానే నోటిఫికేషన్ ఇస్తాం.

డాక్టర్ పద్మలీల, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల

మాంగనీస్ అక్రమ తవ్వకాలపై దాడులు

- పొక్లెయిన్, ట్రాక్టర్ సీజ్


మైనింగ్ తవ్వకాల వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు


అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

రాజాం: మండల పరిధిలో గారాజు చీపురుపల్లి గ్రామం పరిసర ప్రాంతాల్లోని జీడి తోటల్లో విజయనగరం రీజనల్ మైనింగ్ అధికారి బి.ప్రసాదరావుతో పాటు సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ ప్రాంతంలో మాంగనీస్ ఖనిజం అక్రమంగా తవ్వి రవాణా చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం రెవెన్యూ అధికారులతో కలిసి మైనింగ్ చేస్తున్న ప్రాంతం వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాంగనీస్ రాళ్ల తవ్వుతున్న పొక్లెయిన్ తో పాటు రవాణాకు సిద్ధం చేసిన ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. ఈ మైనింగ్‌ను చింతలపాటి దిల్లీశ్వరరావు, తోట జోసెఫ్, బూరాడ సురేష్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని, వారిపై రాజాం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశామని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రీజనల్ ఆఫీసర్ ప్రసాదరావు మాట్లాడుతూ మాంగనీస్ ఖనిజాన్ని ఎవరైనా అక్రమంగా తవ్వడం, తరలించడం చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. నిరంతరం ఈ కార్యక్రమాలపై నిఘా పెట్టామని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ డి.సతీష్‌కుమార్, ఏజీ ఎం.సురేష్‌కుమార్, జిల్లా గనులు, భూగర్భశాఖ డీడీ సి.మోహనరావు, ఆర్‌ఐ ఎస్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజలనుంచి వచ్చిన అర్జీలపై అశ్రద్ధ చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు, పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను స్వీకరించగానే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలోనే ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌ను విధిగా నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో సక్రమంగా సరుకులు పంపిణీ చేయకపోతే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుని తొలగించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, సంచుల కొరతలేకుండా చూడాలని చెప్పారు. గృహనిర్మాణాలు పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్లు ఇవ్వాలని తెలిపారు. జియ్యమ్మవలస మండలంలో పీఎం జన్‌మన్ ప్రగతి మందగమనంలో ఉండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి నెల కనీసం 500 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇంజినీరింగ్ అధికారి వీఎస్.నగేష్ బాబు, డీఈఓ ఎన్.తిరుపతినాయుడు, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ తదితరులున్నారు.

కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాచిపెంట మండలం శతాబి వద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలున్నాయని, పొలం గట్టుపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. కూరగాయల విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. జనవరి నుంచి రైతు అవగాహన సదస్సులను నిర్వహించాలని, ఉద్యాన పంటలలో 15 శాతం వృద్ధి ఉండేలా ప్రణాళికలు చేయాలని తెలిపారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు రుణాలను మంజూరు చేయాలన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటుకు, మత్స్య ఉత్పాదక సంస్థ ఆధ్వర్యంలో మత్స్య ఆహార యూనిట్లను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగరవనం, నగర వాటిక అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి జీఏపీ.ప్రసూన, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి మన్మథరావు, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తదితర శాఖాధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యుత్ ఉద్యోగులకు పతకాలు


మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యుత్ ఉద్యోగులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీఈపీడీసీఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్‌కు చెందిన ఉద్యోగులు సత్తా చాటారు. ఇటీవల గుడివాడలో జరిగిన పోటీల్లో వివిధ అంశాల్లో పతకాలు దక్కించుకున్నారు. ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పోటీల్లో పాల్గొన్న పోలిపల్లి పైడిరాజు లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పోటీల్లో కాంస్యం, 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో రజత పతకం, 400 మీటర్ల రిలే పరుగు పోటీలో మరో రజత పతకం సాధించారు. అలాగే ఎ.రామకృష్ణ 1500 మీటర్ల పరుగు పోటీల్లో రజత పతకం 5000 మీటర్ల వాకింగ్ పోటీల్లో కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఐదే పోటీల్లో పి.అనిల్ కుమార్ 200 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నా..400 మీటర్ల పరుగు పోటీల్లో బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పోటీల్లో రజత పతకం సాధించారు. రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన ముగ్గురు ఉద్యోగులను ఆపరేషన్ సర్కిల్ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

ముక్కాంలో ముందుకొచ్చిన సముద్రం

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని భోగాపురం మండలం ముక్కాం, చేపలకంచేరు, కొండ్రాజుపాలెం సముద్రతీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది. ముక్కాం, చేపలకంచేరు మధ్య బుధవారం 50 మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో రెవెన్యూ, మెరైన్, మత్స్యశాఖ అధికారులు మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ప్రతికూల వాతావరణం దృష్ట్యా వేటకు వెళ్లవద్దని మత్స్యకారులను హెచ్చరించారు.

21న సాగునీటి ప్రాజెక్టు కమిటీల చైర్మన్ ఎన్నిక

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ఐదు సాగునీటి ప్రాజెక్టు కమిటీలకు ఈ నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. డెంకాడ ఆనకట్టు సిస్టం, ఆంధ్ర రిజర్వాయర్, తాటిపూడి రిజర్వాయర్, పారాది ఆయకట్టు, గొర్లె శ్రీరాములు నాయుడు ప్రాజెక్టు స్టేజ్-1 లకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు జరిగే ఎన్నికల ప్రక్రియలో ఇటీవల సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొని ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు.

సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు పీపీ వావా


కార్మికులతో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.పీపీ వావా

పార్వతీపురం: సఫాయి కర్మచారి (పారిశుద్ధ్య కార్మికులు)లకు పునరావాసం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డా.పీపీ వావా అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సఫాయి కార్మికులకు పునరావాసం కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని సూచించారు. ష్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. సఫాయి కర్మచారి కుటుంబసభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సఫాయి కర్మచారి ప్రమాదశాత్తు మృతిచెందితే తక్షణం కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల ఆదాయాలకు అతీతంగా ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని, కార్మికులను గుర్తింపు కార్డులను మంజూరుచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్.శోభిక, అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్, డీపీఓ టి.కొండలరావు, డీఈఓ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా కార్మిక శాఖాధికారి కె.రామకృష్ణారావు, డీటీఓ రమేష్ రామన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరాజు, సర్వేశ్వరరావు తదితరులున్నారు.

నేడు సీనియర్స్ ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 19న నిర్వహించనున్నట్టు అసోసియేషన్ చీఫ్ కోచ్ డీవీ చారి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి నగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో జరిగే ఎంపిక పోటీల్లో 18 సంవత్సరాలు వయస్సు నిండి ఎఫ్ఏఐ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. జిల్లాస్థాయి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు విజయనగరం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్ 83747 37707 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ నేడు

విజయనగరం: జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలతో పాటు విజయనగరం కార్పొరేషన్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.మాణిక్యంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017వ సంవత్సరం అనంతరం మున్సిపాలిటీల్లో ఖాళీగా ఉన్న తెలుగు విభాగంలో 4 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను, కార్పొరేషన్ పరిధిలో సోషల్ విభాగంలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ 3 పోస్టులను భర్తీ చేసేందుకు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు. జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు వారి సేవా పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో పండించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా పరిశ్రమ ఏర్పాటుకు యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా విధానాలను రూపొందించాలని కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పండించే వరి, మామిడి, మొక్కజొన్న వంటి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ఆధారం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై జనవరి మొదటి వారంలో పారిశ్రామిక సదస్సు నిర్వహించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఔత్సాహిక యువ పారిశ్రామిక వేత్తల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈడీసీఏపీ డీవీ కళ్యాణ చక్రవర్తి, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లలో గజ ఈతగాళ్ల ను ఏర్పాటు చేయాలి

జిల్లాలోని చింతపల్లి, చేపల కంచేరు, ముక్కాం బీచ్‌లలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ మత్స్యశాఖ డీడీని ఆదేశించారు. ఈ మేరకు ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చింతపల్లి మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బీచ్‌లు ఉన్నాయని, ఆదివారాలు, మరి కొన్ని ప్రత్యేక రోజుల్లో పర్యాటకులు ఎక్కువగా వస్తున్నారని, ఆ బీచ్ ల వద్ద గజ ఈతగాళ్లు ఉండాల్సిన అవసరం ఉందని మెరైన్ ఎస్పీ రవి వర్మ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కలెక్టర్ ఎన్ఫోర్స్‌మెంట్ రాజ్ శాఖ ద్వారా వెల్లించేందుకు అవకాశం ఉందని, నెలలో నాలుగు రోజులు బీచ్ ల వద్ద పనిచేయడానికి గజ ఈతగాళ్లను గుర్తించాలని సూచించారు. సమావేశంలో మెరైన్ అదనపు ఎస్పీ సౌమ్యలత, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డీపీఓ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ డీడీ నిర్మల లక్ష్మి లాకమాని తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మెడికవర్ ఫ్యామిలీ కార్డ్‌ను ప్రారంభించిన కలెక్టర్

తిరుమల మెడికవర్ ఆస్పత్రి వారు అందించే వైద్య సేవలకు సంబంధించిన ఫ్యామిలీ కార్డును కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ బుధవారం ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ రూ.500తో ఎవరైనా పాటు ఐదుగురు సభ్యులు వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఓపీ సంప్రదింపులపై 25 శాతం, ఓపీ ఫార్మసీ బిల్లులపై 15 శాతం, నగదు ప్రవేశాల కోసం ఐపీ, డేకేర్ సేవలపై 10 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. బీమా రోగులకు వైద్యశాల సేవలపై 50 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. రూ.5 వేల కంటే ఎక్కువ ఉన్న ఫార్మసీ బిల్లుపై 20 శాతం తగ్గింపు ఉంటుందని వివరించారు.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. ఇటీవల అరకు కొండల్లో జరిగిన సబ్‌జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొన్న గుంట్యాడ కేజీబీవీలో చదువుతున్న కుమ్మరి అశ్విని, గండిమాని పవిత్రలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఇద్దరు క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, సెపక్‌తక్రా జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.భవాని, డి.సీత లు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభా పాటవాలు కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.